www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

జనవాసాల్లోకి జింక

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: స్థానిక జింకల పార్కులోని ఓ జింక సమీపంలోని గిరింపేట వద్ద కుక్కల దాడిలో గాయపడింది. జింకను గమనించిన ప్రజలు కుక్కల దాడి నుండి కాపాడారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. జింకను పట్టుకోవడంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సహకారం అందించారు.

జింకను వాహనంలో తీసుకెళుతున్న ఫారెస్టు అధికారులు

ముఖ్యమంత్రి సభకు పటిష్టమైన బందోబస్తు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సోమవారం నిర్వహించనున్న సిఎం కుప్పం బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జాఘువా తెలిపారు. బహిరంగ సభ బందోబస్తుపై పోలీసున్నతాధికార్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమయ పాలన పాటించి అందరూ వారికి కేటాయించిన విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే పై అధికారులకు తెలిపితే వారికి బదిలీ ఏర్పాటు చేస్తామని, వైర్లెస్ సెట్ లో అందరు అందుబాటులో ఉంటూ సభకు వచ్చే ప్రజలతో అందరూ మర్యాదగా మెలగాలని సూచించారు. ప్రజలు ఎవరైనా పిటిషన్ తీసుకుని వస్తే వారి వద్ద నుండి మర్యాద పూర్వకంగా తీసుకుని ఎస్పీ వారి కార్యాలయం లేదా కలెక్టర్ కార్యాలయానికి చేర్చే ఏర్పాట్లు చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉందని తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, గ్యాలరీలోకి సామర్థ్యానికి మించి ప్రజలను అనుమతించరాదని, పార్కింగ్ ప్రదేశాలలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించి, బందో బస్తు టైం లో ఎవరూ మొబైల్ ఫోన్ వాడకూడదు. డ్యూటీ పై శ్రద్ధ పెట్టాలన్నారు. క్రమశిక్షణ తో, నిబద్ధతతో విధులు నిర్వహించి ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

కుప్పం సిఎం సభ బందోబస్తు కోసం 4 అడిషనల్ ఎస్పీ లు, 17 డి.ఎస్పీలు, 47 మంది సిఐలు, 133 ఎస్ఐలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సిఎం సభ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికార్లతో మాట్లాడుతున్న ఎస్పీ జాఘువా

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్

ప్రజాశక్తి -శాంతిపురం: హంద్రీ– నీవా కాలువ నీటి విడుదలను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం కుప్పం నియోజకవర్గానికి రానున్నారు. ఉదయం 10.25 గంటలకు రాజుపేట్, రామకుప్పం మండలం హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. ఉదయం 10.40 గంటలకు హెచ్ఎన్ఎస్ఎస్ నీరు విడుదల సందర్భంగా పూజను ప్రారంభిస్తారు. ఉదయం 10.45 గంటలకు హెచ్ఎన్ ఎస్ ఎస్ నీరు విడుదల చేస్తారు. ఉదయం 11.45 గంటలకు శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. ఉదయం 11.25 గంటలకు గుండిశెట్టి పల్లి వద్ద బహిరంగ సభకు హాజరవుతారు. మధ్యాహ్నం 2.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం వద్దకు తిరుగు పయనమవుతారు.

'హంద్రీ -నీవా' కుప్పం ప్రజల జీవనాడి!

- ఇచ్చిన మాట ప్రకారం 'హంద్రీ -నీవా'ను పూర్తి చేసిన సీఎం
- రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - రామకుప్పం, శాంతి పురం: 'హంద్రీ – నీవా' కాలువ కుప్పం ప్రజల జీవనాడి అని, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కుప్పం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ – నీవా కాలువ పూర్తి చేశారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనులు శాఖ మంత్రి డాక్టరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గానికి సోమవారం రానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి, చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డప్ప, కలెక్టర్ ఎస్ షన్మోహన్, ఎంఎల్‌సి భరత్, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశీల రఘురాంలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి గత ఎన్నికల సందర్భంగా కుప్పంకు హంద్రీ–నీవా నీటిని అందిస్తామని మాట ఇచ్చి పూర్తి చేశారన్నారు. కుప్పం ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు హార్టికల్చర్‌పై ఆధారపడి ఉన్నారని, హంద్రీ –నీవా ద్వారా 54 చెరువులను నింపి దాదాపు 6,300 ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. పాలారు ప్రాజెక్ట్ నిర్మాణంపై ఉన్న సందిగ్ధం తొలగిపోవడంతో త్వరలో నిర్మాణం చేపట్టేం దుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తద్వారా కుప్పం నియోజక వర్గంలో తాగునీరు, సాగునీరు కొరత లేకుండా చూడలన్నది ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధి పై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి ఉంచి నాలుగున్నర సంవత్సరాలలో అన్ని విధాలా అభివృద్ధి చేశారని, కుప్పం ను మున్సిపాల్టీగా ప్రకటించి చేపట్టిన మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణం దాదాపు రూ.7 కోట్లతో పురోగతిలో ఉందన్నారు. రూ.66 కోట్లు మున్సిపాల్టీ అభివృద్ధికి కేటాయించారని, కుప్పం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశామని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా రామకుప్పం మండలం రాజుపేట వద్ద హెలిప్యాడ్, హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించారు. శాంతిపురం మండలం గుండు శెట్టిపల్లి వద్ద బహిరంగ సభ హెలిపాడ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎన్ ఎస్ ఎస్ సి రాజగోపాల్, ఆర్‌డిఓ లు, సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా వున్న హంద్రీ- నీవా' కాలువను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

3న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాగర్జన

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్:

మార్చి 3 న విశాఖపట్నం లో కాంట్రాక్టు, ఔటసోర్సింగ్, ఉద్యోగుల మహాగర్జను విజయవంతం చేయాలని జేఏసి ఛైర్మన్ చైతన్య పిలుపు నిచ్చారు. పర్మినెంట్ కోసం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర జెఏసి ఆధ్వర్యంలో మార్చి 3 న విశాఖపట్నం లో నిర్వహించే మహాగర్జన లో జిల్లా నుండి ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరు కావాలని ఈ రోజు ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ చైతన్య, ప్రధాన కార్యదర్శి 108 శివకుమార్, సర్వ శిక్ష సిఆర్‌పి ల జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, సతీష్ కోరారు. అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాల పైన స్పష్టమైన రాజకీయ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం లో జరిగే మహాగర్జనకు జిల్లా లోని అన్ని ప్రభుత్వ శాఖ ల నుండి రావాలని వారు పిలుపునిచ్చారు.

మహాగర్జనను జయప్రదం చేయాలని కోరుతున్న జేఏసి ఛైర్మెన్ చైతన్య

యుటిఎఫ్ విజయవాడ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు

ఏజిజేఏసి నిర్ణయం సరికాదు: యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

లక్షలాది ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాటం చేయాల్సిన జేఏసి సమస్యలపై ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టత రాకుండా ఈనెల 27వ తేది తలపెట్టిన చలో విజయవాడను వాయిదా వేయడాన్ని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యతిరేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. ఆదివారం విజయవాడలో యుటిఎఫ్ నిర్వహించిన సమావేశంలో సోమశేఖర్ మాట్లాడుతూ ఈ సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు.

ఆ ఐదు స్థానాల్లో ఉత్కంఠ

- రెండో జాబితాలోనూ వారి పేర్లు ఉంటాయా..?
- టిడిపి అధినేత ఆలోచన ఏమిటో..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనసేన, టిడిపి ఉమ్మడి పొత్తులో టిడిపి పోటీ చేసే స్థానాలు తొలి జాబితా శనివారం ప్రకటించే విషయం తెలిసిందే.. చిత్తూరు జిల్లాలో ఐదుగురికి, తిరుపతి జిల్లాలో ఇద్దరికి టిడిపి అభ్యర్థి స్థానాలు ఇస్తూ ప్రకటించారు. చిత్తూరు ఐదు స్థానాల్లో చిత్తూరు టిడిపి అభ్యర్థిగా గురజాల జగన్మోహన్‌రావు, జీడి నెల్లూరు నియోజకవర్గం అభ్యర్థిగా వి.ఎం.థామస్‌ను కొత్తవారిని ప్రకటించారు. కుప్పం, పలమనేరు, నగిరి నియోజకవర్గాల్లో పాత వారే పోటీ చేస్తున్నారు. ఇక తిరుపతి జిల్లాలో గూడూరు పాశం సునీల్ కుమార్ పేరును ప్రకటించారు. సూళ్లూరుపేటలో అనూహ్యంగా నిలబడ్డ విజయ్‌శ్రీని కొత్త అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, వెంకటగిరి స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. అయితే ఇప్పటికే తామే అభ్యర్థులమని శ్రీకాళహస్తిలో మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తనయుడు బొజ్జల సుధీర్ రెడ్డి ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. అలాగే వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ నాయుడు ప్రచారం చేస్తున్నారు. తిరుపతి టిడిపి స్థానా నికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు నరసింహ యాదవ్, ఊక విజయ్ కుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్‌లు పోటీలో ఉన్నారు. ఎవరిని అభ్యర్థిగా మీరు ఎన్నుకుంటారు చెప్పాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సెల్ఫోన్లో మెసేజ్ పంపి మరీ సర్వే చేశారు. అయితే తిరుపతి ఓటర్లు ఎవరికి మెజార్టీ ఇచ్చారో తెలీదు. ఇక్కడ జనసేన, టిడిపి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోరినట్లు తెలుస్తోంది. జనసేన కు ఈ స్థానం ఇస్తే కొణిదెల నాగబాబు, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ పోటీ పడుతున్నారు. ఈస్థానం ఎవరికి దక్కుతుందో చూడాలి మరి. అలాగే చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికే పులివర్తి నాని నియోజకవర్గంలో గడపగడప తిరిగేసారు. పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి కూడా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

చంద్రగిరి నుంచి టిడిపి తరపున పులివర్తి నాని, డాలర్ దివాకర్ రెడ్డి, బడి సుధా యాదవులు ముమ్మరంగా పోటీపడుతున్నారు. మొదటి జాబితాలో పేరు ప్రకటించకపోవడంతో ఈ నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తల్లో ఉత్కంఠత నెలకొంది. సత్యవేడు లోనూ ముగ్గురు తీవ్రంగా పోటీ పడుతున్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే హేమలత కూతురు డాక్టర్ హెలెన్, 2019లో పోటీ చేసి ఓడిపోయిన జెడ్డా రాజశేఖర్, వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం ఇటీవలే ఎదురు తిరిగి టిడిపి పక్షాన చేరబోతున్నారు. వీరి ముగ్గురు టిడిపి సీటు ఆశిస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చల్లా రామచంద్రారెడ్డి ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ఇటీవల బిఎస్‌వైపి పార్టీ స్థాపించిన రామచంద్ర యాదవ్ కూడా పొత్తులో భాగంగా టికెట్ ఆశిస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలోని టిడిపి శ్రేణుల్లో టెన్షన్ మొదలైంది. పూతలపట్టు నియోజకవర్గంలో ప్రముఖ జర్నలిస్టు డాక్టర్ మురళి మోహన్ ఇప్పటికే ప్రచారంలో మునిగిపోయారు. ఊరు వాడఅంతా తిరిగే చేస్తున్నారు. పూతలపట్టు బహిరంగ సభలోను డాక్టర్ మురళీమోహన్‌ని ఆశీర్వదించాలని స్వయంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయినా మొదటి జాబితాలో మురళి పేరు రాకపోవడం ఉత్కంఠ నెలకొంది.. ఏదేమైనాప్పటికీ ఈ ఐదుచోట్ల టిడిపి శ్రేణుల్లో, పార్టీ మద్దతు దారుల్లో టెన్షన్ నెలకొంది.

సమస్యలతో సతమతం

వెంగళరావు కాలనీ డ్రైనేజీల్లో దుర్గంధం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

స్థానిక వెంగళరావు కాలనీలో డ్రైనేజీ కాలువల్లో దుర్గంధం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తను తొలగించక పోవడంతో సమీప ప్రాంతా ల్లోని ప్రజలు దుర్గంధాన్ని తట్టుకోలేక పోతున్నారు. 30 ఏళ్ళుగా అభివృద్ధికి నోచుకొని వెంగళరావు కాలనీ సమస్య లను పట్టించు కోవాలని ఇక్కడి ప్రజలు కోరు తున్నారు.

డ్రేనేజీలో పేరుకుపోయిన చెత్త

పలమనేరులో ఎన్నికల సెగలు

నేతల మధ్య మాటల కాక

ప్రజాశక్తి -వి కోట : పలమనేరు నియోజకవర్గంలో ఎన్నికల సెగలు వేడి పుట్టిస్తున్నాయి. నేతల మాటల తూటాలు కాక రాజేస్తున్నాయి. దీంతో పలమనేరు నియోజకవర్గంలో ఎన్నికలు ఆసక్తి కరంగా మారాయి.

పలమనేరు నియోజకవర్గంలో అధికార వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ప్రధాన ప్రతిపక్షం టిడిపి తరపున మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పోటీ చేస్తున్న సంగతి విదితమే. వారిద్దరి మధ్య ప్రస్తుతం పరస్పరం మాటల తూటాలతో నియోజకవర్గంలో ఎన్నికల వేడి పుట్టిస్తోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గ టిడిపి అసెంబ్లీ అభ్యర్థిగా రాష్ట్ర మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం నుండి తమ అభిమాన నేతకు అధికారికంగా టికెట్ ప్రకటించడంతో వారిని అభినందిస్తూ తమ సంఘీభావం తెలుపుతున్నారు. అధికార వైసిపి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇటీవల రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి ప్రకటించడంతో మొత్తం నియోజకవర్గం లోని క్యాడర్‌ను ఎన్నికలకు సమానత్తం చేస్తూతిరుగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మళ్లీ తనను గెలిపి స్తాయన్న నమ్మకంతో 'గడప గడపకు మీ ఎమ్మెల్యే' ద్వారా నియోజక వర్గంలోని ప్రతి గడపకు వెళ్లి మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే ప్రజల కు విన్నవిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత పలమనేరు నియోజక వర్గంలో జరిగిన 'అభివృద్ధిపై చర్చకు సిద్ధ' అంటూ పలు మార్లు టిడిపి నేతలకు ఎమ్మెల్యే సవాల్ విసిరారు. తాను ప్రజలకు ఎల్లవేళలా అందు బాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్క రిస్తున్నామని జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి , రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సహకారంతో గ్రామాల్లో నిర్మించిన సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాలు , విలేజ్ క్లినిక్‌లతోపాటు జగనన్న కాలనీలు, సిమెంట్ రోడ్లు వంటి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని ప్రజలు వీటిని చూసి మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మరొక వైపు ప్రధాన ప్రతిపక్షం టిడిపి తరపున 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' ద్వారా అమరనాథ రెడ్డి ప్రజల్లోకి వెళుతూ అధికార వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా క్షేత్రం లో ఎండగడుతున్నారు. నియోజక వర్గంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్య మని వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తమ కు అనుకూలిస్తుందని, నియోజక వర్గానికి ఆనుకుని ఉన్న కుప్పం నియోజక వర్గంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోటీ చేస్తుండడంతో దాని ప్రభావం పలమనేరు నియోజకవర్గంపై ఉంటుందని అది తమకు లాభిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. మరో వైపు అధికార వైసిపి నేతలు పక్కనున్న పుంగనూరు నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేస్తుండడంతో దాని ప్రభావం కూడా పలమనేరు నియోజకవర్గంపై పడుతుందని వారు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఖరారు చేయడంతో వీరిద్దరూ 'నేనంటే ..నేనే గెలుస్తాం' అంటూ ధీమా వ్యక్తం చేస్తుండడంతో వీరి గెలుపు ఓటమి పట్ల ఇతర పార్టీలలో పోటీ చేసే అభ్యర్థుల ప్రభావం ఎవరిపై చూపుతుందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే రాజకీయ నాయకుల ప్రసంగాలతో ఎన్నికల సెగలు నియోజక వర్గంలో జోరు అందు కున్నాయి.

వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డి

దళితుల భూమిని కాజేశారు.. అడిగితే దాడి చేశారు..!

ప్రజాశక్తి -గంగవరం:

దళితుల భూమిని అగ్రకుల పెత్తం దారులు అన్యాయంగా కాజేయడమే కాకుండా ప్రశ్నిస్తే దళితులపైనే దాడి చేసిన సంఘటన గంగవరం మండలం గంద్రాజుపల్లి వద్ద ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు శ్రీనివాసులు, లక్ష్మమ్మ కథనం మేరకు గంద్రాజుపల్లి వద్ద సర్వేనెంబర్ 189/1 ఎ లో 1.42 సెంట్లు వ్యవసాయ భూమి తన తండ్రి సూర మునెప్ప, ఆరెప్ప, గంగప్పలది ఉమ్మడి ఆస్తి అని వివరించారు. ఈ భూమిని లక్ష్మీపతి నుండి కుమార్ దాస్ అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు చెపుతున్నాడని తెలిపాడు. తమ భూములను ఇప్పటి వరకు ఎవరికీ విక్రయించలేదని బాధితుడు వాపోయాడు. ఈనెల 21వ తేదీన కుమారు దాస్ భూమిలో మట్టి తోలుతున్నట్లు తెలుసుకొని తనతో పాటు లక్ష్మమ్మ, శ్యామల, సీతమ్మ నాగరత్నమ్మ, వికలాంగులైన వెంకటేష్, వెంకట రమణ భూమి వద్దకు వెళ్లి కుమార్ దాసును అడుగుతుండగా రెచ్చిపోయి తనను, తమ ఆడవాళ్లను కొట్టి బెదిరించాడని తెలిపారు. తమపై కసి తీర్చుకోవడానికి దళితులను రెచ్చగొట్టి మట్టి తోలుతున్న చలపతి , గట్టప్ప ,రంగయ్యలను ట్రాక్టర్లు నిలిపివేయాలని అడుగుతుండగా వారు సైతం తమపై దాడి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గంగవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న బాధిత దళిత రైతులు

ప్రమాదాల నివారణకు భద్రత పరికరాల నిర్వహణ కీలకం

జాతీయ విపత్తు అగ్ని మాపకాధికారి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్:

అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గించడానికి అగ్ని మాపక భద్రత పరికరాల నిర్వాహణ కీలకం అని, ఒకప్పుడు పూరి గుడిసెలు ఉన్న కాలంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకొని ఊరంతా కాలిపోయిన సంఘటనలు ఉన్నాయి. నేడు పూరి గుడిసెల స్థానంలో పెంకులు, రేకులు, పక్కా బిల్డింగులు వచ్చాయి. అగ్ని ప్రమాదాలు కూడా తగ్గాయి. అయితే ఇటీవల కాలంలో చోటు చేసుకున్న అతిపెద్ద సంఘటన పల్లిపట్లు వద్ద చోటు చేసుకున్న టపాకాయల గొడౌన్‌లో చోటు చేసుకున్న సంఘటనే.. ప్రాణనష్టంతో పాటూ ఆస్తినష్టం కూడా జరిగింది. ఆ సంఘటన తరువాత టపాకాయ గొడౌన్‌లు, దుకాణాల వద్ద ఫైర్‌సేఫ్టీ చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాలమైన ప్రాంతాల్లో టపాకాయల విక్రయాలకు అనుమతి ఇస్తున్నాం. అధిక వర్షాలు, వరద సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసి వరదనీటిలో కొట్టుకుపోయే వారిని రక్షించాము. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకారం అందించాం. జిల్లాలో ప్రస్తుతం చోటు చేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా చోటు చేసుకుంటున్నాయి. కొన్ని వాణిజ్య సంస్థలు నిబంధనలు పాటించని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫైర్‌సేఫ్టీ చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రమాదాల సమయంలో ఆస్తి నష్టం, ప్రాణనష్టం చోటు చేసుకుంటోంది. నాణ్యమైన విద్యుత్ పరికరాలను ఉపయోగించడంతో పాటు ఫైర్‌స్టేఫ్టీ తప్పని సరిగా పాటించాలని జాతీయ విపత్తు అగ్నిమాపకాధికారి పెద్దిరెడ్డి సూచించారు.

1944 ఏప్రిల్ 14న బొంబాయి (ముంబాయి) ఓడరేవులో గన్‌ఫౌడర్ కల్గిన ఫాస్ట స్టికింగ్ నౌకలో అగ్నిప్రమాదం సంభవించి పేలిపోయి హార్బర్‌లో ఉన్న నౌకలు, ఇతర భవనాలకు అగ్నిప్రమాదం సంభవించి ఆ ప్రమాదంలో 336 మంది ప్రజలతో పాటు 66 మంది అగ్నిమాపక సిబ్బంది చనిపోయారు. వీరితో పాటు 87 మంది అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారి సంస్మరణార్థం ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించేలా ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేది నుండి అగ్నిమాపక దినోత్సవాలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని మాపక భద్రతకు సంబంధించి 'ప్రజాశక్తి' అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న : సాధారణంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: ఇంటిలో వస్తువులను అల్మారాల్లో, షెల్ఫులో సక్రమంగా ఉంచుకోవాలి. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా షార్ట్ సర్క్యూట్ సమయంలో ప్రమాద తీవ్రత తగ్గించవచ్చు. చిన్న పిల్లలకు అందుబాటులో అగ్గిపెట్టలు, టపాకాయలు అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్లు, అగ్గిపుల్లలు పారవేసేముందు ఆర్పివేసి కింద పడేయాలి.

ప్రశ్న: వంటి గదిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: వంటగది కింద పై భాగంలో గాలి, వెలుతురూ ఉండేలా చూసుకోవాలి. ఐఎస్ఐ గ్యాస్ ట్యూబ్‌లను వాడకం మంచిది. ఎల్పిజి గ్యాస్‌వాడకం పూర్తిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి. గ్యాల్ లీక్‌వుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వు అపివేయాలి. గ్యాస్ లీకేజి అనుమానం కలిగినప్పుడు ఎలక్ట్రిక్ స్విచ్‌లు అన్...ఆఫ్ చేయరాదు. అగ్నిమాపకశాఖ, గ్యాస్ ఏజేన్సీ సహాయం తీసుకోవాలి.

ప్రశ్న: అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగెత్తరాదు. నేలపై పరుండి దుప్పటి చుట్టుకోవాలి. కాలిన శరీరభాగం మీద చల్లనినీరు పోయరాదు. పొగతో నిండిన గదులలో మోచేతులు, మోకాళ్లపై పాకడం మంచిది. ముక్కు, నోటికి తగిలేలా తడిగుడ్డ ఉంచి గాలి పీల్చడం ద్వారా పొగ, కార్బన్‌డై అక్సైడ్ పీల్చకుండా అపవచ్చు.

పెద్దిరెడ్డి, జాతీయ విపత్తు అగ్నిమాపక జిల్లా అధికారి.

ఇంటర్వ్యూ

ప్రశ్న: గోదాములు, గిడ్డంగుల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: గోదాములు, గిడ్డంగుల వద్ద స్టాక్ చెక్క దిమ్మెలపై ఉంచాలి. తగినంత నీరు మంటలు అదుపు చేసేందుకు అగ్ని మాపక సాధనాలను అందు బాటులో ఉంచు కోవాలి. వస్తువుల నిల్వ 4.5మీ.. ఎత్తుకంటే ఎక్కువ నిల్వ చేయరాదు. పై కప్పుకు స్టాకుకు మధ్య కనీసం 2 అడుగుల దూరం ఉండాలి. వస్తువుల ఎగుమతి, దిగుమతులు సందర్భాల్లో వాహనం ఇంజిన్లు ఆపు చేయాలి.

ప్రశ్న : గ్రామీణ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: గడ్డివాముల నుండి నివాస గృహాలకు తప్పని సరిగా 60 అడుగుల దూరం ఉండాలి. గడ్డి వాములను గాలి వాటంగా రైట్ యాంగిల్స్‌లో నిర్మించాలి. గుడిసెకు, గుడిసెకు మధ్య కనీసం 30 అడుగల దూరాన్ని పాటించాలి. ఏ విధమైన బహిరంగ మంటలను అనుమతించరాదు. వంట పొయ్యి పడుకునే ముందు అర్పివేయాలి.

200 మందికి ఉచిత కంటివైద్య పరీక్షలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జైన్ సంఘం నేతృత్వంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత కంటివైద్య శిబిరం ఆదివారం స్థానిక రాములవారి గుడి సమీపంలోని జైన్ ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. తిరుపతి అరవిందో ఐ ఆసుపత్రి వైద్య బృందం 200 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 91 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా జైన్ సంఘం ప్రతినిధి సుభాష్‌జైన్ మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్షలతో ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజన సౌకర్యంతో అపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా ముస్లింల పండుగ

ప్రజాశక్తి -సోమల: ముస్లింల పెద్దల పండుగ(షబ్ ఎ బరాత్) ను మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ మాసం ముందు వచ్చే పెద్దల పండుగకు ముస్లింలు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రమంలో ముస్లిం కుటుంబాల వారు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలను చేసి అనంతరం ఇండ్లలో పెద్దలకు నూతన వస్త్రాలను పెట్టి ప్రత్యేకంగా ప్రార్థనలను చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమల కందూరు నంజంపేట పెద్ద ఉప్పరపల్లి నవాబ్ పేట ఇరికిపెంట గ్రామాలలో ముస్లిం సోదరులు పెద్దల పండుగను జరుపుకున్నారు.

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం, గున్న ం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు అంద జేశారు. సంఘ సభ్యులు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ దాతల సహకా రంతో తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల పేదవారికి నిత్యవసర సరుకులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్ర మంలో శ్రీనివా సులురెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గూడూరుటౌన్: చాగణం లలితమ్మ భాస్కరరావు మె మోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ట్రస్ట్ ఏవో కృష్ణ తెలి పారు. పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఏ ర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ట్రస్ట్ ఏవో తెలిపారు.

ఘనంగా ఆర్‌సీపీజీ వార్షికోత్సవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్‌సీపీ గురుకులంలో ఆది వారం ఆ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. స్థానిక ఎమ్మెల్యే కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆటపాటల్లో విజేతలుగా నిలి చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల అధినేత ఢిల్లీబాబు, కరస్పాండెంట్ సుప్రజ పాల్గొన్నారు.

షర్మిల సభను విజయవంతం చేద్దాం: చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మార్చి 1న కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి అధ్యక్షురాలు షర్మిలరెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎంపీ చింతామోహన్ దిశా నిర్దేశం చేశారు. ఆదివారం గాంధీభవన్ ప్రాంగణంలో పార్టీ శ్రేణులతో కలిసి సభ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. షర్మిల సభకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక రాష్ట్రం నుండి ప్రజా ప్రతినిధులు పాల్గొననున్న నేపథ్యంలో సభ విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు భాస్కర్, పట్టణ అధ్యక్షులు గోపి, ఏపీసిసి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, ఏపీసిసి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, పార్టీ కేడర్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు గణేష్ తల్లి ఎల్లమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి పుత్తూరుకు చెరుకొని ఎల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ హరి, తదితర నాయకులు ఉన్నారు.

క్రీడలతోనే యువతకు మానసిక ఉల్లాసం: సర్పంచ్

ప్రజాశక్తి-రేణిగుంట: రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలోనీ ఆషా అధ్యక్షుడు జూలియన్ రాజు పరిరక్షణలో వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ నగేషం ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నమెంట్ను ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన మ్యాచ్‌లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌బాబు, మధు, రాజేంద్ర, రవి జావిద్ అలీఖాన్ తదితర్రులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరం: రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రబాబు మళ్లీ తిరిగి సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' అనే నినాదంతో రాష్ట్రమంతటా ఓటర్లను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకొచ్చింది చంద్రబాబు మాత్రమేనని, దీనిపై కాదంటున్న వైసీపీ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. తిరుపతి విమానాశ్రయం వద్ద 29కంపెనీలు, ఏపీఎస్ఎస్‌డీసీని తీసుకొచ్చారన్నారు. వైసీపీ పాలనలో పరిశ్రమలు రాక నిరుద్యోగులు పక్కరాష్ట్రాలకు వలసలు పోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగెత్తి చూపుతున్న మీడియాపై దాడులకు పాల్పడుతూ వైసీపీ ప్రభుత్వం మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మహేష్‌యాదవ్, హేమంత్, వాసు, సందీప్, సంతోష్, దిలీప్ పాల్గొన్నారు.

విక్టరీ తథ్యం: గాలి భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ-జనసేన విక్టరీ తథ్యం అని టీడీపీ నగరి నియోజకవర్గ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 3, 4వ వార్డుల్లో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ వారు అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జీవరత్నంనాయుడు, ధనపాల్, మాధవయ్య, కేశవచారి, గణేష్, షణ్ముగంరెడ్డి, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరులో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కన్నయ్యనాయుడు, మండల కన్వీనర్ సుధాకర్‌నాయుడులు 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాబు, గురవయ్య, మోహన్‌రెడ్డి, విజయ్, సురేష్, వెంకీ, మనోహర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేద్దాం: రామ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్: రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని నాయకులు, కార్యకర్తలకు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటగిరిలో పార్టీ కేడర్‌తో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, సదానందరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా తోటోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేటలో శ్రీ కోదండ రాముని తోటోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం 6గంటలకు తిరుపతిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం నుండి శ్రీ సీతా లక్ష్మణ సమేత రాముని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కుపు చంద్రపేటకు తీసుకొచ్చారు. ఉదయం 11గంటలకు ఉత్సవ విగ్రహాలను పీఠంపై అధిష్ఠింపజేసి అర్చకులు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్రామయ్య, స్థానిక సర్పంచ్ పిపాసి, తులసి రామిరెడ్డి, సుబ్బరామయ్య, టిటిడి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండల కేంద్రంలోని 121/1 సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారని ఆదివారం గ్రామ సర్పంచి దట్టం అంజలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ రూ.కోట్లు విలువ చేసే భూమిని భూ కబ్జాదారులు కబ్జా చేస్తున్న రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. ఈ భూమిపై ఇప్పటికే హైకోర్టు నుంచి ఉత్తరవులు ఉన్న ఆ ఉత్తర్వులను బేకాతయారు చేసి ఆక్రమిస్తుంటే అధికారులు చూద్దాం అన్యాయంగా ఉందని తెలిపారు. గ్రామ ప్రథమ పౌరురాలుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించోదని పలుమార్లు చెప్పిన ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భవనం నిర్మించుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

క్రీడల్లోనూ సామాజిక దృక్పథం చాటిచెప్పడం ప్రశంసనీయం

- స్కేటింగ్‌లో రికార్డులు సాధించిన వారిని అభినందించిన మంత్రి - క్రీడాకారులకు పభుత్వం అండగా ఉంటుందని హామీ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: క్రీడల్లోనూ సామాజిక దృక్పథాన్ని చాటిచెప్పడం ప్రశంసనీయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. 'ఆడపిల్లలను చదివిద్దాం -ఆడపిల్లలను రక్షిద్దాం', 'ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం - భూగర్భ జలాలను కాపాడుకుందాం', 'అనాథలను ఆదరిద్దాం -బాల కార్మికులను నిరోధిద్దాం' అనే నినాదాలతో రోడ్ స్కేటింగ్ చేశారు . దీని ద్వారా వజ్ర వరల్డ్ రికార్డ్, హిందుస్థాన్ రికార్డు, ఏషియన్ కాంటినెటల్ రికార్డ్, వజ్ర నేషనల్ రికార్డులను సాధించిన తాడిపత్రి శ్రీరమణమహర్షి అనాథ పిల్లల రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఏడుగురు మంత్రిని కలిశారు. తాము తీసుకున్న అవార్డులను మంత్రి ద్వారా అందుకొని ఆనందపడ్డారు. ఈ సందర్భంగా కోచ్ మధు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఉదయం 6.45 గంటలకు తాడిపత్రిలో మొదలు పెట్టి నుండి 13వ తేది రాత్రి 8.45 గంటలకు మళ్లీ తాడిపత్రి చేరుకునే వరకు సామాజిక నినాధాలతో గుత్తి, గుంతకల్, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, పెనుకొండ కొత్త చెరువు ,ధర్మవరం మీదుగా 750 కిలోమీటర్ల దూరం ఏడుగురు విద్యార్థులు స్కేటింగ్ చేశారన్నారు. ఈ నెల 15వ తేదీన తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించిన విద్యార్థులుగా అవార్డును అందుకున్నామన్నారు. ఈ ప్రయాణంలో తాము ఎలాంటి అడ్డంకులు జరగకుండా అనుమతులు ఇప్పించి సహకారం అందించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. స్కేటింగ్ చేసిన విద్యార్థులు ఇషాక్, యోగేంద్ర, పృథ్వీ, రామ్‌చరణ్, భార్గవ, శ్రీరామ్, తరుణ్‌లను మంత్రి అభినందించారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. మంచిపనులకు సహకారం అందిస్తూ ఉంటామన్నారు. ఈ సందర్భంగా స్కేటింగ్ ప్రయాణానికి సహకరించిన అనంతపురం కలెక్టర్, ఎస్పీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ సౌత్ జోన్ సెక్రటరీ బి.ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి రోజా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: విధి వక్రీకరించడంతో విషాదం నిండిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున అభయ హస్తం అందించారు. కష్టమంటూ గడప తొక్కే వారికి మంత్రి ఆర్కే రోజా అండగా నిలుస్తున్నారు. వారి కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహకారం అందిస్తూ వారిని ఆదుకుంటున్నారు. ఇలా నియోజకవర్గంలో బాధలకు గురైన 12 మందికి ఆదివారం సీఎం సహాయ నిధి ద్వారా సుమారు 16.00 లక్షలు రూపాయల ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్కె రోజా నగరి మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మరోసారి మంత్రి నిరూపించారు. ఆర్థిక సాయం అందుకున్న బాధితులు ఆనంద భాష్పాలతో మంత్రికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

పోలీసు బందోబస్తు మధ్య గ్రూపు 2 పరీక్షలు

ప్రజాశక్తి -గంగవరం: స్థానిక మదర్ తెరిసా కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ టు పరీక్షల సందర్భంగా ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పలమనేరు డిఎస్పీ మహేశ్వర రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి కాపీయింగ్, తదితర అంశాలకు తావు లేకుండా పారదర్శకంగా జరిగేలా గట్టి చర్యలను డిఎస్పి ఆదేశాలతో పలమనేరు పోలీసులు చర్యల తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గంగవరం మండలంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాన్ని పలమనేరు డిఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలమనేరు డిఎస్పి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించారని పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో పోలీసుల పకడ్బందీ పర్యవేక్షణలో ఎలాంటి అవకతలు, మాస్ కాపీయింగ్ తదితర ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహణకు చర్యలు తీసుకున్నా మన్నారు. నగరంలో ఎక్కడ కూడా ట్రాఫిక్ అంత రాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశా మన్నారు. పరీక్షా కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలులో పెట్టడంతో పాటు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో వైఫై, జిరాక్స్ సెంటర్లు మూసే యించి సజావుగా పరీక్షలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిన్న గోవిందు, గంగవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న డిఎస్పి మహేశ్వర్‌రెడ్డి

మామిడి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

జిల్లా హార్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మామిడి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని జిల్లా హార్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగాధరనెల్లూరు గ్రామ పంచాయతీ 100 గొల్లపల్లి వద్ద ఉన్న జైన్ ఫామ్ ఫ్రెష్ ఆధ్వర్యంలో మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ డిడి మాట్లాడుతూ రానున్న సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సమావేశం జైన్ ఫామ్ ఫ్రెష్ మేనేజర్ సమీర్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం రైతులకు చాలా ఉపయోగక రమన్నారు. మామిడి సాగులో పిందె పూత దశలో వచ్చే వ్యాధులను గుర్తించి శాస్త్రీయ పద్ధతులలో వాటిని నివారణ మార్గాలపై రైతులకు డీడీ వివరించారు. ఈ కార్యక్రమంలో జైన్ ఫార్మ్ ఫ్రెష్ మేనేజర్ షమీర్ శర్మ , జిల్లా వైసీపీ రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్ బాబు, పిఆర్వో చంద్రతో పాటు పలువురు రైతులు, జైన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా హార్టికల్చర్ డిడి మధుసూదన్‌రెడ్డి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి అనిత

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి అయ్యేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనిత పేర్కొన్నారు. ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనిత మాట్లాడుతూ మండలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గడపగడప 'మన ప్రభుత్వం' ద్వారా మండలంలో ప్రతి గ్రామానికి 20 లక్షల రూపాయలు మంజూరై వాటితో గ్రామాలలో రోడ్లు, మంచి నీటి సదుపాయం అందుబాటులోకి వచ్చాయన్నారు. కొన్నిచోట్ల మిగిలిపోయిన కొన్ని పనులను కూడా త్వరితగతన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు హరిబాబు, బేబీ, జెడ్పిటిసి లక్ష్మీ ప్రియ, సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్, ఏపీఎం చిరంజీవి, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి వందన, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, అంగన్‌వాడీ సూపరువైజర్ నాగరత్నమ్మ, హౌసింగ్ ఏఈ దాము, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అనిత

యువకులతోనే అభివృద్ధి సాధ్యం: మాజీ మంత్రి

ప్రజాశక్తి -గంగవరం: మండల కేంద్రం గంగవరం పంచాయతీలో మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి 'బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాయిన్స్ గజమాలతో యువకులు, మహిళలు మాజీ మంత్రికి స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం భవిష్యత్తు యువకుల పైనే ఆధారపడి ఉందని యువకులు అనుకుంటే ఏమైనా చేయవచ్చని గతంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాల గుర్తించి ఎవరికి ఓటు వేయాలో తెలుసుకొని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మీరే నిర్ణయించుకోవాలని ప్రతి ఒక్కరూ టిడిపిని అధిక మెజార్టీతో గెలిపించి తనను పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి కాయిన్స్ మాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

రాబోవు కాలం టిడిపిదే: థామస్

- కురివికుప్పం సర్పంచ్ పార్టీలో చేరిక

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారం చేజిక్కించుకుంటుంది అనే ధీమా వ్యక్తం చేశారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి థామస్. ఆదివారం మండలంలోని కురివికుప్పం పంచాయతీలో 'మన ఇంటికి మన తామస్' కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా థామస్ హాజరయ్యారు. ఆ పంచాయతీ ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ తామస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో అధికారం చేపడు తుందని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి ముందుకెళ్లా లని కోరారు. స్థానిక సర్పంచ్ అబుల్ రెడ్డి వైసీపీ నుంచి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆయన అను చరులు ఆయన వెంట నడిచారు. డాక్టర్ థామస్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.


థామస్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

క్రైం న్యూస్

పరుష పందేలలో అపశృతి

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: చంద్రగిరిలో జరిగిన పరుష పందేలలో అపశృతి చోటుచేసుకుంది. చంద్రగిరి మండలం సూరావారిపల్లెలో ఆదివారం పోలీసుల ఆంక్షలు లెక్క చేయకుండా స్థానికులు పశువుల పండుగ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి కోడెగిత్తలు భారీగా వచ్చాయి. పోటీలు ప్రారంభంలో పశువులను గుంపులను డప్పులు, టపాకాయలు పేల్చి బెదిరిస్తూ ఉరకలు పెట్టించారు. కోడిగిత్తలను పట్టుకునేందుకు యువకులు ముందుకొచ్చారు. ఓ కోడిగిత్త నడుంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వెంకటముని(60)ని ఢీకొనడంతో కిందపడి స్పృహ కోల్పోయాడు. ప్రేక్షకులు వెంటనే వెంకట మునికి వైద్య సేవలు అందించడం కోసం 108కు సమాచారం ఇచ్చారు. 108సిబ్బంది ప్రథమ చికిత్స చేసి చంద్రగిరి వైద్యశాలలకు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెంకటముని మృతి చెందినట్లు తెలిపారు. అలాగే పచ్చికాపలం నుండి చంద్రగిరిలో జరిగే పరుష పందేలలో ఒక కోడెగిత్తను వాహనంలో తీసుకొచ్చారు. ఆ కోడెగిత్త జనాలను చూసి భయపడి జనాలపైకి దూరింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్య నిమిత్త తిరుపతికి తరలించారు. పాల్గొనేందుకు ఈ విషయంపై చంద్రగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ రామయ్యను వివరణ కోరగా పోలీసులు అనుమతులు లేకుండా చంద్రగిరి సర్కిల్ పరిధిలో సురావారిపల్లి, చంద్రగిరిలో పరుస పందేలు నిర్వహించడంతో నిర్వాహకులకు ముందస్తుగా నోటీసులు అందజేశామని తెలిపారు. మృతి చెందిన వెంకటముని బంధువులు ఫిర్యాదులు ఇస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నోబుల్ స్కూలుకు బహుమతుల వెల్లువ

బహుమతులు పొందిన నోబుల్ స్కూలు విద్యార్థులు

ప్రజాశక్తి -శాంతిపురం: చిత్తూరు బృందావన్ స్కూల్ లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీలలో శాంతిపురం మండ లంలోని నోబుల్ స్కూల్ కు చెందిన విద్యార్థులకు పలు లెవెల్స్ లో జిల్లా స్థాయి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఈ పోటీలకు చిత్తూరు జిల్లా లోని పలు ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా నోబుల్ స్కూల్ విద్యార్థులు స్టార్ జూనియర్స్ లెవెల్ 2 లో కార్తికేయ మొదటి బహుమతి, జూనియర్స్ లెవెల్ 2 లో నందీశ్వర మొదటి బహుమతి, సీనియర్స్ లెవెల్ 2 లో సంతోష్ ద్వితీయ బహుమతి , సీనియర్స్ లెవెల్ 1 లో మోక్ష గెలుపొందారు. ఈ కార్యక్రమం లో నోబుల్ స్కూల్ అధినేత సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు దివ్య, మంగలీశ్వరి, శ్వేత పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్

ప్రజాశక్తి -సోమల: సోమవారం కుప్పంలో జరగనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభను మండలంలోని వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ అమాస మోహన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 99 శాతం హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చారని రానున్న ఎన్నికలలో వైసిపి తిరిగి విజయ ఢంకా మోగించేందుకు కుప్పంలో నిర్వహించనున్న బహిరంగ సభకు మండలం నుండి అధిక శాతం హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, నాయకులు వాసుదేవయ్య, రమణారెడ్డి, మెకానిక్ బాష, బాలు, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

పైప్ లైన్లకు మరమ్మతు.. ఓవర్ హెడ్ ట్యాంక్ క్లీనింగ్

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు కు సంబంధించిన కమ్మపల్లి గ్రామంలో సర్పంచ్ బాషా మసూద్ ఆధ్వర్యంలో త్రాగునీటిని ఓవర్ హెడ్ ట్యాంకు సరఫరా చేసే పైప్లైన్లు పగిలిపోవడంతో నూతన పైపులైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంక్ బ్లీచింగ్ చేసి పరిశుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తున్నట్లు కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెకానిక్ బాష, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్య సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తిరూరల్: మండలంలోని వాగువేడు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధులు అక్కుపల్లి సుబ్బయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయం అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వాగువేడు గ్రామంలో సుబ్బయ్య మనవడు అక్కుపల్లి మహేష్‌యాదవ్, సుబ్బయ్య కాంస్య విగ్ర హం ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొని ఆయన చేతుల మీదగా స్వాతంత్ర సమరయోధులు వెంకట సుబ్బయ్యయాదవ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా సచివాలయం ఆవరణలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, బానుమూర్తియాదవ్, నాగోలు శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌రెడ్డి, రమణయ్యయాదవ్, వాసుదేవరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరం: రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రబాబు మళ్లీ తిరిగి సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' అనే నినాదంతో రాష్ట్రమంతటా ఓటర్లను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకొచ్చింది చంద్రబాబు మాత్రమేనని, దీనిపై కాదంటున్న వైసీపీ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. తిరుపతి విమానాశ్రయం వద్ద 29కంపెనీలు, ఏపీఎస్ఎస్‌డీసీని తీసుకొచ్చారన్నారు. వైసీపీ పాలనలో పరిశ్రమలు రాక నిరుద్యోగులు పక్కరాష్ట్రాలకు వలసలు పోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగెత్తి చూపుతున్న మీడియాపై దాడులకు పాల్పడుతూ వైసీపీ ప్రభుత్వం మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మహేష్‌యాదవ్, హేమంత్, వాసు, సందీప్, సంతోష్, దిలీప్ పాల్గొన్నారు.

అన్యాయాన్ని ప్రశ్నించినందుకు వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి -గంగవరం: అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి పై గుర్తుతెలియని వ్యక్తులచే దాడి చేసి గాయపరిచి ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలం లోని గంగవరం పంచాయతీ మన్నారు నాయన పల్లి గ్రామానికి చెందిన బాధితుడు విజయ్ కుమార్ కథనం మేరకు..మాజీ సైనికుడు అయిన ఉదయ్ కుమార్ అనే వ్యక్తి అన్యాయంగా చెరువు స్థలంలో కాలువలు తీసి గట్టుగా వేసి ఆక్రమించుకొని తమ భూములోకి కలుపుకునేందుకు ప్రయత్నం చేయగా అన్యాయమని ప్రశ్నించామన్నారు. శనివారం రాత్రి బుల్లెట్ బైక్ పై కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తమ ఇంటి ముందు గల రోడ్డులో ఎక్సలేటర్ పెంచి విపరీతంగా హారన్ లు ,శబ్దం చేశారన్నారు. మరుసటి రోజు ఆదివారం ట్రాక్టర్ పని ముగించుకుని ఇంటికి వస్తుండగా పలమనేరు పట్టణ సమీపం లోని ఘంటావూరు చెరువు కట్ట పై గుర్తు తెలియని వ్యక్తులు తనపై భౌతికంగా దాడి చేశారని ఈ సంఘటనలో కుడి భుజం ఎముక విరిగిందని తెలిపారు. అంతే కాక తనపై పిడిగుద్దులు గుద్దుతూ 'మా జోలికి వచ్చే ధైర్యం ఎవ్వరికీ లేదని అలాంటిది నన్ను ప్రశ్నిస్తావా?' అని హెచ్చరించారని తెలిపారు. ఆ సమయంలో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని తప్పించుకొని నా భార్య భవాని, తమ్ముడు సహాయం తో పలమనేరు ఏరియా ఆసుపత్రికి చేరుకున్నట్లు తెలిపారు తాను ట్రాక్టరును నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని ఇప్పుడు కుడి భుజం ఎముక ఫ్రాక్చర్ కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. దాడి జరిగిన సంఘటన గురించి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తనపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి ఉదయ్ కుమార్ అనే వ్యక్తి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని కాపాడాలని వారు ఈ సందర్భంగా పోలీసులను అభ్యర్థించినట్లు తెలిపారు.

దాడికి గురైన బాధితుడు విజయ్‌కుమార్